క్లుప్తంగా

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

చీమకుర్తి రూరల్: మండలంలోని గోనుగుంటలో మండల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మక్కెన మరియారోజీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు థామస్ ఆధ్వర్యంలో శనివారం పుస్తకాలు, నోట్‌బుక్స్, ఇతర విద్యా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో బండి శ్రీనివాసరావు, రవిశంకర్, అఖిల, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు ఛత్రపతి శివాజీ మహారాజ్ బైక్ ర్యాలీ

ఒంగోలు మెట్రో: మరాఠా సంఘం అధ్యక్షుడు కాళే వెంకటేశ్వరరావు నిర్వహణలో మరాఠా మిత్ర బృందం, ఛత్రపతి శివాజీ మహారాజ్ అభిమానుల ఆధ్వర్యంలో ఒంగోలు మరాఠీ పాలెం శివాజీ విగ్రహం నుంచి ఆదివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు మరాఠ సంఘ అధ్యక్షుడు కాళే వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఒంగోలు ఏకేవీకే కాలేజీలో మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన, క్విజ్ పోటీలు ఉంటాయన్నారు. గద్దలగుంట ఓరియంటల్ హైస్కూల్ అధ్యాపకులు, కమిటీ నేతృత్వంలో నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం ఆరు గంటలకు డాక్టర్ రామన్ ఫౌండేషన్ వారి సాయిబాబా నాట్యమండలి, విజయవాడ వారి జయహో ఛత్రపతి శివాజీ మహారాజ్ చారిత్రక నాటకం ఉంటుందన్నారు. సీబీఆర్ అకాడమీ ఆఫ్ స్పోర్ట్స్, ఎడ్యుకేషనల్ నిర్వహణలో నిర్వహించే ఈ కార్యక్రమంలో నగర ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్మితే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో కిషోర్‌బాబు

కొత్తపట్నం: ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి కిషోర్‌బాబు హెచ్చరించారు. కొత్తపట్నం రైతు సేవా కేంద్రంలో శనివారం ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. కల్తీ పురుగు మందులు, కల్తీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రైతు సంతకంతో ప్రతి కొనుగోలుకూ బిల్లు ఇవ్వాలని తెలిపారు. అనుమతిలేని గోడౌన్‌లలో ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు నిల్వ చేస్తే చర్యలు ఉంటాయన్నారు. రైతులకు వ్యవసాయ అధికారుల వివరాలు తెలిపి వారి సూచన మేరకు పురుగు మందులు, ఎరువులు వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అమర్‌నాథ్, ప్రసాద్, షాజహాన్, డీలర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

- జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో కిరణ్‌కుమార్

కొత్తపట్నం: పాఠశాలల ఉపాధ్యాయులు సమయపాలన పాటించి ఉదయం 9 గంటల్లోపు బయోమెట్రిక్ వేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఏ కిరణ్‌కుమార్ ఆదేశించారు. మండల విద్యా వనరుల కేంద్రంలో శనివారం నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఆధార్ లేకపోయినప్పటికీ ప్రతి పాఠశాలలో విద్యార్థులను చేర్చుకోవాలని సూచించారు. ఆహ్లాదకరమైన అభ్యాసనం కల్పించాలని తెలిపారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలని సూచించారు. శ్వాస ఆగితే జీవికి ఎంత ప్రమాదమో.. ప్రేరణ ఆగితే అభివృద్ధికి అంత ఆటంకం కలుగుతుందని వివరించారు. తల్లికి వందనం పథకంలో ఏమైనా సమస్యలుంటే సరిచేసుకోవాలని సూచించారు. విద్యార్థుల అభిరుచులు, ఆసక్తులు పెరిగేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. మధ్యాహ్న భోజన పథకంపై శ్రద్ధ వహించాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. విద్యార్థులకు కనీసం 25 పద్యాలు నేర్పేలా ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో పద్మావతి, ఈతముక్కల, గమళ్లపాలెం ఉపాధ్యాయులు చెంచుపున్నయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- జూలై 9న సమ్మెను జయప్రదం చేయాలి
- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు పిలుపు



కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

నాగులుప్పలపాడు: కార్మిక చట్టాలను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ జూలై 9వ తేదీ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని ఉప్పుగుండూరులో పంచాయతీ కార్మికులతో ఎలీషా అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం దుర్మార్గమైన చర్యని అన్నారు. తద్వారా భవిష్యత్‌లో యూనియన్లు ఏర్పాటు చేసుకోవడం కష్టతరమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కార్మిక, ఉద్యోగవర్గాలకు చివరి ఆయుధమైన సమ్మె చేసే హక్కు నిర్వీర్యమవుతుందన్నారు. వేతనాల చెల్లింపు, కనీస వేతనాల అమలుకు కూడా అవకాశం లేకపోగా, యాజమాన్యాలకు అనుకూలంగా చట్టాలను సవరించారని విమర్శించారు. వెంటనే ఆ నాలుగు లేబర్ కోడ్లను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు రూ.26 వేలు అమలు చేయాలని, ప్రభుత్వ రంగ పరిరక్షణ, రైతాంగానికి మద్దతు ధరలు ఇవ్వాలని, తదితర డిమాండ్లతో చేపట్టిన సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. పంచాయతీ కార్మికులంతా సమ్మెలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రామారావు, జి.బసవపున్నయ్య, సీనియర్ నాయకురాలు సుబ్బులమ్మ, కార్మికులు మగ్గారావు, తిరపతయ్య పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు వీడ్కోలు



హెచ్‌ఎం శ్రీదేవిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తపట్నం: స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసి పదోన్నతి, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శనివారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా హైస్కూల్ హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండు సంవత్సరాల పాటు ఎఫ్ఏసీ హెచ్‌ఎంగా బాధ్యతలు నిర్వహించిన ఎం.శ్రీదేవి పదోన్నతిపై బేస్తవారిపేట బాలుర ఉన్నత పాఠశాలకు వెళ్లడం జరిగిందన్నారు.

ఇప్పటి వరకు పాఠశాల అభివృద్ధిలో ఆమె చూపిన చొరవ అభినందనీయమని కొనియాడారు. కొత్తపట్నం హైస్కూల్ నుంచి ఒకేసారి ముగ్గురు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతిపై వెళ్లడం, మరో ఇద్దరు ఉపాధ్యాయులు ప్రాథమికోన్నత పాఠశాలలకు హెచ్‌ఎంగా వెళ్లడం ఇదే ప్రథమని హెచ్‌ఎం శ్రీదేవి తెలిపారు. కొత్తపట్నం హైస్కూల్ నుంచి 19 మంది ఉపాధ్యాయులు ఒకేసారి బదిలీపై వెళ్లారన్నారు. హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ హరిబాబు, స్కూల్ ఫస్ట్ అసిస్టెంట్ డి.సాయి కిషోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా పీవీ నరసింహారావు జయంతి



రంగారాయుడు చెరువు వద్ద ఉన్న పీవీ నరసింహారావు కాంస్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ ప్రముఖులు

ఒంగోలు మెట్రో: దివంగత ప్రధానమంత్రి, సాహితీవేత్త, గొప్ప తత్వవేత్త పీవీ నరసింహారావు జయంతిని ఆంధ్రప్రదేశ్ మహిళాభ్యుదయ సమితి కార్యాలయంలో నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. తన ఆర్థిక సంస్కరణల ద్వారా ప్రపంచ సంక్షోభం నుంచి దేశాన్ని రక్షించిన మహానుభావుడని పలువురు వక్తలు కొనియాడారు.

బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో...

ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధాని, భారతరత్న దివంగత పీవీ నరసింహారావు జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రంగారాయుడు చెరువు వద్ద ఉన్న బ్రాహ్మణ సేవా సమితి కార్యాలయం శుభప్రదం భవనంలో పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమితి కార్యదర్శి గంజాం రంగనాథ్, ఉపాధ్యక్షుడు మహంకాళి శేషయ్య, కార్యవర్గ సభ్యులు ముక్తినూతలపాటి వాసు, వ్యామజాల ప్రసన్న, మైనంపాటి సాయి, శనగవరపు శివకుమార్, మేనేజర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఒంగోలు రంగారాయుడు చెరువు వద్ద ఉన్న పీవీ నరసింహారావు కాంస్య విగ్రహానికి ఒంగోలులోని బ్రాహ్మణ ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మద్యం దుకాణాలు సమయపాలన పాటించాలి



సంతనూతలపాడులో మద్యం దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ సీఐ సుకన్య

సంతనూతలపాడు: మండలంలోని మద్యం షాపులు సమయపాలన పాటించాలని చీమకుర్తి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుకన్య ఆదేశించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు శనివారం మండలంలోని గంగవరం గ్రామంలో గల మద్యం దుకాణాన్ని తనిఖీ చేశారు. అనంతరం గ్రామస్తులకు గంజాయి, డ్రగ్స్, నాటు సారా వినియోగం వలన కలిగే నష్టాలు, వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సంతనూతలపాడు మండలంలోని 5 మద్యం షాపులను తనిఖీ చేసి సమయపాలన పాటించాలని, ఎమ్మార్పీ ధరలకు మాత్రమే మద్యం సీసాలు విక్రయించాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సాంకేతికతదే కీలకపాత్ర



ఎస్పీ దామోదర్‌కు డ్రోన్ కెమెరాను అందజేస్తున్న తాళ్లూరు రామాలయ కమిటీ ప్రతినిధులు

- ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో సాంకేతికత కీలకపాత్ర పోషిస్తోందని ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. తాళ్లూరు మండలం విఠలాపురం కాలనీకి చెందిన మారం అనంతరెడ్డి నేతృత్వంలోని వైకుంఠ రామాలయం కమిటీ ప్రతినిధులు శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో డ్రోన్‌ను పోలీస్‌శాఖకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆధునిక పరికరాల సహాయంతో నేర నియంత్రణకు ముమ్మరంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో డ్రోన్ కెమెరాలను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. చెయిన్ స్నాచింగ్, ఈవ్‌టీజింగ్, రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలు, అసాంఘిక కార్యకలాపాలకు అనుకూలమైన శివారు ప్రాంతాలు, తోటలు, బహిరంగ ప్రదేశాలను ముందుగానే గుర్తించడం జరుగుతుందని తెలిపారు. అక్కడ డ్రోన్లను పంపించడం ద్వారా నిఘా పెడుతున్నట్లు వివరించారు. ముఖ్యంగా మనుషులు వెళ్లలేని ప్రదేశాలకు డ్రోన్లను ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. సామాజిక బాధ్యతగా పోలీసు శాఖకు డ్రోన్ బహూకరించడం అభినందనీయమన్నారు. ఈ డ్రోన్‌ను తాళ్లూరు పోలీసు స్టేషన్‌కు అప్పగించారు.

ఉద్యోగ విరమణ చేసిన టీచర్‌కు సన్మానం



కనకారెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఒంగోలు సిటీ: మండలంలోని కరవది గ్రామంలో పీఆర్‌ఆర్ జెడ్పీ హైస్కూల్లో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన కాపా కనకారెడ్డి, పద్మావతి దంపతులను శనివారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ 39 సంవత్సరాల పాటు సేవలందించి ఎందరో విద్యార్థులను కనకారెడ్డి తీర్చిదిద్దారని కొనియాడారు. కార్యక్రమంలో కాపా అమర్‌నాథ్‌రెడ్డి, కాపా శ్రీనాథరెడ్డి, సర్పంచ్ కోటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, రమేష్, రంగసాయి, రామారావు, బిక్షాలురెడ్డి, ఉలిచి ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, ఏపీటీఎఫ్ నాయకులు యోహాన్‌రెడ్డి, రఘుబాబు, ఉపాధ్యాయుల బృందం, బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల ఆకస్మిక తనిఖీలు



గ్యాస్ గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ బృందం

సంతనూతలపాడు: మండలంలోని రేషన్ షాపులు, శ్రీ అయ్యప్ప ఇండేన్ గ్యాస్ గోడౌన్, స్థానిక పెట్రోల్ బంకును ఎన్ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ ఆర్.వి.ఎస్. కృష్ణమోహన్, సంతనూతలపాడు తహసీల్దార్ ఎస్.ఎల్.నారాయణరెడ్డితో కూడిన బృందం శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సంతనూతలపాడులోని 7, 4 నంబర్ల రేషన్ షాపులను మొదటిగా తనిఖీ చేశారు. అనంతరం స్థానిక పెట్రోల్ బంకులు, గ్యాస్ గోడౌన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొలతలు నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన అన్ని ప్రమాణాలు పాటించి ప్రజలకు నాణ్యమైన సేవలందించాలని ఆదేశించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టినట్లు వారు తెలిపారు.

మద్యం తాగే అలవాటు మానుకోండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఈఎస్ వెంకట్

ఒంగోలు టౌన్: మద్యం తాగడం వలన మొత్తం కుటుంబం ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా మానసికంగా అంతులేని ఆవేదనకు గురవుతుందని స్థానిక బలరాం కాలనీ ప్రాథమిక వైద్యశాల మెడికల్ ఆఫీసర్ షేక్ సమీర్ అన్నారు. మద్యం అలవాటు మానుకుంటే కుటుంబంతో పాటు యావత్ సమాజం గౌరవిస్తుందని చెప్పారు. శనివారం బలరాం కాలనీలో కమిటీ ఫర్ ఆల్కహాల్ అవేర్నెస్ అండ్ రెస్పాన్సివ్ ఎడ్యుకేషన్ (కేర్) అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సమీర్ మాట్లాడుతూ సరదాగా మద్యం మొదలుపెట్టి కాలక్రమంలో దానికి అలవాటుపడిపోతున్నారని చెప్పారు. దీనివలన ఆరోగ్యం బాగా దెబ్బతింటుందని, భార్యాబిడ్డలు ఇబ్బందిపడతారని అన్నారు. మద్యం సేవించడం మానుకోవాలనుకునేవారు రిమ్స్ ఆస్పత్రిలోని డీ అడిక్షన్ సెంటర్‌లో సంప్రదించాలని సూచించారు. మద్య వ్యసనం నుంచి విముక్తి కలిగించడానికి వైద్యులు సహకరిస్తారని తెలిపారు. అనంతరం ఏఈఎస్ ఎర్ర వెంకట్ మద్యం వలన కష్టనష్టాలను వివరించారు. పిల్లల భవిష్యత్తుకు పాటుడాల్సిన వారు మద్యం అలవాటు వలన కుటుంబాన్ని రోడ్డున పడేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ ఎ.లీనా, ఎస్సైలు సీహెచ్ గీత, బి.అశోక్, పి.రవి, ఆంజనేయులు పాల్గొన్నారు.

సబ్సిడీ పథకాల యూనిట్లను పరిశీలించిన పీడీ



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నారాయణ

సంతనూతలపాడు: మండలంలోని తక్కెళ్లపాడు, చిలకపాడు, మాచవరం గ్రామాల్లో ప్రభుత్వ సబ్సిడీ పథకాల యూనిట్లను డీఆర్‌డీఏ పీడీ పి.నారాయణ శనివారం పరిశీలించారు. తక్కెళ్లపాడు గ్రామంలో పీఎంఈజీపీ కింద 35 శాతం సబ్సిడీతో మంజూరైన దంత సురేఖకు చెందిన యూనిట్‌ను తొలుత పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. చిలకపాడు గ్రామంలో తుపాకుల సావిత్రి నడుపుతున్న కంప్యూటర్ ఎంబ్రాయిడరీ యూనిట్‌ను పరిశీలించారు. అనంతరం మాచవరం గ్రామంలో శేషమ్మ, పెద్ద నరసింహులు, సీతారామయ్యకు మంజూరైన షేడ్ నెట్ నిర్మాణాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఆయన వెంట వెలుగు ఏపీఎం టి.బాబూరావు, ఎఫ్‌పీఓ ఏపీఎం జే నారాయణ, సీసీలు రామాంజనేయులు, చెంచులక్ష్మి, శ్రీనివాసులు, వీవోఏలు పాల్గొన్నారు.

చెత్త సేకరణ కార్యక్రమాల పరిశీలన

సంతనూతలపాడు: మండలంలోని కొనగానివారిపాలెం, పి.గుడిపాడు గ్రామాల్లో శనివారం ఎంపీడీవో డి.సురేష్‌బాబుతో కూడిన బృందం ఇంటింటికి తిరిగి చెత్త సేకరణ కార్యక్రమాలను పరిశీలించింది. కొనగానివారిపాలెంలో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని పరిశీలించి మొక్కలు నాటారు. వర్మీకంపోస్ట్ తయారీపై సలహాలు, సూచనలు చేశారు. సర్పంచ్ నాదెండ్ల మల్లయ్య, కార్యదర్శులు ఎం.వెంకటేశ్వరరావు, జ్యోతి పాల్గొన్నారు.